ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024 | 5

- జిల్లాలో ఆందోళనకరంగా రహదారి ప్రమాదాలు
- ఈ ఏడాది ప్రమాదాల్లో ఇప్పటికి 165మంది మృతి
- భారీగా పట్టుబడుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- కొందరి బాధ్యతలేని డ్రైవింగ్‌తో యాక్సిడెంట్‌లు
- ప్రమాద ఘటనల్లో అమాయకులే బాధితులు
- ఆర్థిక భరోసా లేక చితికిపోతున్న కుటుంబాలు
- ప్రజలు సామాజిక బాధ్యతతో మెలగాలంటున్న మేధావులు

# ఈ ప్రమాదాలకు.. అంతం లేదా?

**జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు..**



రోడ్డు ప్రమాదాల సంఖ్య - 450
మరణించిన వారి సంఖ్య - 165మంది
గాయపడిన వారి సంఖ్య - 541మంది



గత 15రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి సంఖ్య - 554మంది



గత 15రోజుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారి సంఖ్య - 747మంది

మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపితే ఈ నెంబరులో ఫిర్యాదు చేయొచ్చు

**9490763489**



కాకినాడ కల్పనాసెంటర్‌లో గత నెల 20న రాత్రి జరిగిన ప్రమాద ఘటన వద్ద భయానక దృశ్యం(ఫైల్)

గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో లారీ ఆటో ఢీకొన్న ఘటన(ఫైల్)

పైనున్న గణాంకాలు చూస్తేనే అర్థమవుతుంది. మన జిల్లా ఏ పరిస్థితుల్లో ఉందో.. బాధ్యతలేని డ్రైవింగ్‌తో చాలామంది రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. తద్వారా అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దీనివల్ల ఆర్థిక భరోసా లేని వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. పోలీసులు నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్‌ల్లో కేసులు భారీగా పట్టుబడుతున్నాయి. చాలామంది యువత బాధ్యతలేమితో వ్యవహరిస్తున్నారు. జరిమానా, జైలుశిక్ష విధించినా మార్పురావడంలేదు. దీనివల్ల ప్రమాదాలకు వారే కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదాలకు అంతం లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాలకు కారణం కావొద్దని మేధావులు సూచిస్తున్నారు.

**కాకినాడ క్రైం:**
కాకినాడ నగరంలో ఇటీవల జరిగిన ఓ ప్రమాద ఘటన మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. ఓ వాహనం 100 కిలోమీటర్ల స్పీడుతో వచ్చి విచక్షణారహితంగా ఢీకొనడంతో ఆ ప్రమాదం బారిన పడిన వారి మృత్యుఘోష మిన్నంటుతోంది. ఒకరి మరణం ఆ ఇంటిళ్లపాదికి తీరని శోకంగా, నూరేళ్ల శాపంగా మారుతోంది. గాయపడిన వ్యక్తి కుటుంబ పెద్ద అయితే అతడు కోలుకునే వరకు ఆ కుటుంబంపై పడే ఆర్థిక భారం అంతా ఇంతా కాదు. ఆర్థికంగా భరోసా కల్పించాల్సిన వ్యక్తి ప్రమాదానికి గురైతే చేయని తప్పునకు తాను శిక్ష అనుభవించడమే కాకుండా ఆ కుటుంబం కూడా శిక్ష అనుభవిస్తోంది.

## ఒక ప్రమాదం.. మూడు కుటుంబాలకు శాపం

### జల్సాలకు అలవాటుపడి ప్రమాదం

కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన చల్లా రామ్మోహన్ ఎంబీఏ చదివాడు. జల్సాలకు మరిగిన ఆ యువకుడు కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. అప్పటినుంచి దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. కొంతకాలం విశాఖపట్నం వెళ్లిపోయిన అతడు దొంగతనాలు చేస్తూ కొంత వెనకవేసుకుని ఇటీవల కాకినాడలో ఉన్న సొంతింటికి వచ్చాడు. రూ.30లక్షలతో మహేంద్ర ఎక్స్‌యువీ-700 కారును కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో ఈనెల 20వతేదీ రాత్రి ఒక యువతిని కారులో ఎక్కించుకుని మద్యం సేవించి ఆ మత్తులో కారును వేగంగా నడుపుతున్నాడు. ఆ తరుణంలో కారు కాకినాడ కల్పనాసెంటర్‌కు వచ్చేసరికి వారి ముందు వెళ్తున్న యాక్టీవా వాహనాన్ని కారుతో బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో కాకినాడ పేర్రాజుపేటకు చెందిన పీత దుర్గాసతీష్(31), నీలవారితోటకు చెందిన చాట్ల నాగలక్ష్మణ్‌కుమార్(34) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అక్కడే మరోవాహనంపై ఉన్న రేచర్లపేటకు చెందిన జక్కం దుర్గాప్రసాద్(32) తీవ్రంగా గాయపడి తన కుడి కాలును కోల్పోయాడు. అతడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి ఈనెల 23న విగతజీవుడయ్యాడు.



సతీష్(ఫైల్‌ఫొటో)



లక్ష్మణ్(ఫైల్‌ఫొటో)



దుర్గాప్రసాద్(ఫైల్‌ఫొటో)

### కుటుంబ పరిస్థితులు

- ఈ ప్రమాదంలో మరణించిన సతీష్‌కు ఏడేళ్ల కిందట దేవీ అనే యువతితో వివాహమైంది. వారుండే ఇంటివద్దనే చిన్న హోటల్ పెట్టుకుని అల్పాహారం విక్రయిస్తుంటారు. వీరికి ఐదేళ్ల క్రితం కుమారుడు జన్మించాడు. తమకుమారుడికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు చిరు వ్యాపారం చేస్తూనే ఎన్నో కలలు కంటున్నారు.
- ఈ ప్రమాదంలో మరణించిన మరో వ్యక్తి లక్ష్మణ్‌కుమార్. అతడు హైదరాబాద్‌లో సీరియల్స్ షూటింగుల్లో హెల్పర్‌గా పనిచేసేవాడు. తండ్రిని కోల్పోయిన అనంతరం తన తల్లి, సోదరుడ్ని వదిలి ఉండలేక ఇక హైదరాబాద్ వెళ్లలేదు. కొంతకాలంగా ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు.
- మరో వ్యక్తి కాకినాడలోని ముమ్మిడివారి వీధికి చెందిన దుర్గాప్రసాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే అతడు ఇటీవలే ఇంటికి వచ్చాడు. ప్రమాదం జరిగిన తర్వాత అతడి కాలు తెగి వేరుపడడంతో ఆ ఘటనను చూసిన అతడి తండ్రి గుండెలవిసేలా రోధించాడు. అనంతరం దుర్గాప్రసాద్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశాడు.




జిల్లాలో మొత్తం 101 బ్లాక్ స్పాట్‌లున్నాయి. అంటే ప్రమాదకర ప్రాంతాలని అర్థం. ఈ ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పార్లమెంటులో మన రాష్ట్ర ఎంపీలు అడిగిన ప్రశ్నకు గాను కేంద్రమంత్రి ఇచ్చిన గణాంకాల ప్రకారం వీటిని గుర్తించారు. ఈ బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి చేయాల్సిఉంది.

## జిల్లాలో బ్లాక్‌స్పాట్‌లు 101

**పిఠాపురం:** కత్తిపూడి-పామర్రు మధ్య గల 216వ జాతీయరహదారిని నాలుగులైన్ల రహదారిగా విస్తరించే పనులు కత్తిపూడి-తిమ్మాపురం మధ్య 2016లో ప్రారంభమై 2019లో పూర్తయ్యాయి. రహదారి విస్తరించిన తర్వాత ప్రమాదాలు అధికమయ్యాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో 2018, అక్టోబరు 22వ తేది లారీ ఆటో ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో 9మంది మరణించారు. దీంతో ప్రభుత్వం స్పందించి తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేయగా వీరు 27.5కిలోమీటర్ల పొడవునాగల 216వ జాతీయరహదారిని తనిఖీ చేసి 40కిపైగా బ్లాక్‌స్పాట్‌లు గుర్తించారు. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల బృందం సూచించినా ఆ దిశగా ప్రయత్నాలు జరగలేదు.

**గొల్లప్రోలు రూరల్:** గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలోని 16వ నెంబరు జాతీయరహదారిపై చెందుర్తి, వన్నెపూడి జంక్షన్లు, కేహెచ్ జంక్షన్లు, వన్నెపూడి-దర్మవరం మలుపులను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వన్నెపూడి-కొడవలి సెంటర్ ప్రమాదాలకు నెలవుగా మారింది.

**జగ్గంపేట/తుని రూరల్/ఏలేశ్వరం/ప్రత్తిపాడు:**
తుని-గండేపల్లి జాతీయ రహదారిలోను పలుచోట్ల బ్లాక్‌స్పాట్లు ఉన్నాయి. గండేపల్లి మండలం మురారి నుంచి కిర్లంపూడి మండలం సోమవరం వరకు జాతీయ రహదారి ఉంది. దీనిపై 8 డేంజర్ స్పాట్లు అధికారులు గుర్తించారు. జగ్గంపేట మండలంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు, రంగవల్లినగర్, జేవీఆర్ కాంప్లెక్స్, కిర్లంపూడి మండలంలో సోమవరం, బూరుగూడి, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారిలవద్ద బ్లాక్‌స్పాట్‌లు గుర్తించారు. తుని నియోజకవర్గంలో 22 కిలోమీటర్లు విస్తరించి ఉన్న 16వ నెంబరు జాతీయ రహదారిపై పలు ప్రమాదాలు జరుగుతున్న ప్రధాన కూడళ్లను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తుని టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, తుని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, తొండంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో యర్రవరం, చిన్నింపేట, పేరవరం జంక్షన్‌లను బ్లాక్ స్పాట్‌లుగా అధికారులు గుర్తించారు. ఈ మూడు కూడళ్లలోనూ హైవేపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. హైవేనుంచి ద్విచక్ర వాహనదారులు సర్వీసు రోడ్లకు మళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రత్తిపాడు 16వ నెంబరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. మండల పరిధిలోని ప్రత్తిపాడు సంతోషిమాత ఆలయ జంక్షన్ నరేంద్రగిరి కొండ జంక్షన్, ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్, రాచపల్లి అడ్డురోడ్డు సెంటర్, ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ సెంటర్‌లను అత్యంతప్రమాదకర బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు.



సామర్లకోట-పెద్దాపురం రహదారిలో భారీగా ఏర్పడిన గోతులు

# గుంత.. చింత..

- దెబ్బతిన్న రోడ్లతో వాహనదారుల అవస్థలు
- ముసురు వర్షాలతో అధ్వానంగా రోడ్లు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

సామర్లకోట, ఆగస్టు 4: హైవే ప్రధాన, గ్రామీణ రోడ్లు గుంతలు మయమై రోత పుట్టిస్తున్నాయి. అడుగుకో గుంత, గజానికో గొయ్యి చొప్పున వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. గుంతల్లో నీరు వర్షపునీరు నిలిచి వేగంతో వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్‌జామ్‌లు చెప్పనక్కర్లేదు. గతుకుల రోడ్లపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. గోతుల్లో నీరు నిలిచి గొయ్యి పెద్దదా, చిన్నదా తెలియక వాహనం నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతర్గత రోడ్ల పరిస్థితి సైతం అధ్వానంగానే ఉంది. చిత్తడిదారులపై నడక సైతం ఇబ్బందిగా మారింది. ప్రస్తుత వర్షాలకు రోడ్లు దెబ్బతింటే, ఇప్పటికే దెబ్బతిన్న రహదారులు మరింత ధ్వంసమయ్యాయి. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క గోతిలో సైతం తట్టెడు మట్టి పోయలేదన్న ఆరోపణలు ప్రజలనుంచి వెల్లువెత్తుతున్నాయి. ఈ గోతుల రోడ్లపై ప్రయాణిస్తూ గోతిలో మోటార్‌సైకిల్ బోల్తాపడడంతో సామర్లకోట మండలం వెంకటకృష్ణరాయపురం గ్రామ సర్పంచ్ మోర్త పూర్ణిమ ఇటీవల మృతిచెందారు. ఇలా మరెందరో రోడ్లపై గోతుల్లో పడి మృత్యువాతకు గురవుతున్నారు. మరికొందరు ఆస్పత్రుల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాడైన రోడ్లకు మరమ్మతులు చేపడతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మరింత విషమించకముందే రోడ్లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో ప్రధాన జంక్షన్ పట్టణంగా పేరొంది నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో బిజీబిజీగా ఉండే సామర్లకోట నుంచి పలు ప్రాంతాలకు రాకపోకలు సాగించే రహదారులన్నీ పెద్దపెద్ద గోతులుగా మారాయి. సామర్లకోట నుంచి పిఠాపురం రోడ్డులో బ్రౌన్‌పేట శివారు ఏలేరు వంతెన నుంచి మొదలు కోదండరామపురం శివారు వరకూ గోతులమయంగా మారింది.సామర్లకోట-బిక్కవోలు కెనాల్ రోడ్ పొడవునా గోతులమయమే. సామర్లకోట నుంచి కాకినాడ ప్రధాన రోడ్డులో వర్షాలకు గోతులమయంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. సామర్లకోట నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం జంక్షన్ వద్ద ఏడీబీ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. ప్రధాన రహదారుల దుస్థితి ఇలా ఉంటే ఇక గ్రామీణ రహదారుల పరిసితి మరింత అగమ్యగోచరంగా

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, ఆగస్టు 4: మద్యం తాగి వాహనాలు నడిపినా, ఆరు బయట మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. డ్రంక్ అండ్‌డ్రైవ్‌ల్లో అధికసంఖ్యలో వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. 15రోజులుగా డ్రంక్‌అండ్‌డ్రైవ్ నిర్వహించగా 554మంది వాహనదారులపై కేసునమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాలు, మద్యం తాగి వాహనాలు నడిపినా డయల్ 100, 112తోపాటు కంట్రోల్‌రూమ్ నెంబర్ 9490763489 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా ఎస్పీ వాట్సాప్ హెల్ప్ నెంబర్ 9494933233కు కూడా సమాచారం అందించాలన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఫీజును 28లోపు చెల్లించాలి

- కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, ఆగస్టు 4: ఓపెన్ స్కూల్(సార్వత్రిక విద్య) పదోతరగతి, ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు ఫీజును ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 28 వరకూ, అపరాధ రుసుముతో 29నుంచి సెప్టెంబరు 4వరకూ ఏపీఆన్‌లైన్ కేంద్రాల ద్వారా చెల్లించాలని కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. పదో తరగతికి ఓసీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1450 మొత్తం రూ.1550, అన్నివర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1050 మొత్తం రూ.1150 ఫీజుగా చెల్లించాలన్నారు. ఇంటర్మీడియట్‌కు ఓసీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు 1600 మొత్తం రూ.1800 ఫీజుగా చెల్లించాలని, అన్నివర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1300 మొత్తం రూ.1500 ఫీజుగా చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని సంబంధిత స్టడీసెంటర్ నుంచి ఉచితంగా పొంది వివరాలను పూరించి సంబంధిత సమన్వయకర్త ద్వారా తప్పులేమైనా ఉంటే సరిచూసుకుని ఏపీఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు జిరాక్స్ కాపీని, ఫీజు రశీదును సంబంధిత ఏ1 కేంద్రానికి ఇవ్వాలన్నారు. 30రోజులు విధిగా తరగతులకు హాజరుకావాలన్నారు. స్టడీ సెంటర్‌లో ఫీజులు చెల్లించనవసరంలేదని, వివరాలకోసం సార్వత్రిక విద్య జిల్లా సమన్వయకర్త పెమ్మాడిసాయి వెంకటరమణనుగానీ, 8977645704 ఫోన్ నెంబర్లో గానీ సంప్రదించాలని తెలిపారు.



## తల్లిపాలే మొదటి టీకా

- శిశు మరణాలు నియంత్రించేది తల్లిపాలే
- ముర్రుపాలు బిడ్డలకు శ్రేష్ఠం
- తల్లి పాలలో 400 రకాల పోషకాలు
- ఈనెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు

సామర్లకోట, ఆగస్టు 4: పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లి పాలు కీలకం. తల్లిపాలు తాగిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలను మించిన ఔషధం లేదు. ఇటీవలకాలంలో ఈ విషయంలో కొన్ని పెడధోరణులు వస్తున్నాయి. అందుకని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌వో), యూనిసెఫ్, బీపీఎన్‌ఐ వంటి అంతర్జాతీయ జాతీయ సంస్థలు తల్లిపాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పేందుకు ప్రతిఏటా ఆగస్టు 1 నుంచి 7 వరకూ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాయి. స్త్రీశిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఆధ్వర్యంలో జిల్లాలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ముర్రుపాలులో పసుపుపచ్చని కొలస్ట్రం(కొలెస్ట్రాల్) అనే పదార్థం ఉంటుంది. ఇది గుండె, రక్తప్రసరణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి బిడ్డ ఎదుగుదలకు దోహదం చేస్తోంది. లవణాలు, ఖనిజాలు, మాంసకృత్తులు, విటమిన్లు తల్లిపాలలో సమృద్ధిగా ఉంటాయి. బిడ్డ పేగులనుంచి విసర్జకాలను తొలగించడానికి, అలర్జీలు రాకుండా నిరోధించేందుకు తల్లిపాలు తోడ్పడుతాయి. ముర్రుపాలు బిడ్డకు తాపించడం వల్ల సులువుగా జీర్ణమవ్వడంతోపాటు మలవిసర్జన కూడా సులభంగా జరుగుతుంది. శిశువుకు దృష్టిలోపం రాకుండా నివారిస్తుంది. శిశువుకు కావాల్సిన ఉష్ణోగ్రతల్లో తల్లిపాలు ఉంటాయి. తల్లిపాలు తాగితే వేసవిలో శిశువుల నాలుక ఎండిపోకుండా నీరు పట్టనవసరం లేదు. ఎందుకంటే తల్లిపాలలో 90శాతం నీరు ఉంటుంది.

### తల్లికి ఎంతో మంచిది

శిశువుకు ముర్రుపాలు ఇవ్వడంవల్ల తల్లికి రొమ్ము, గర్భసంచి, అండాశయం మొదలగు క్యాన్సర్లు రావని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రసవ సమయంలో స్థిరత్వం కోల్పోయిన గర్భసంచి పూర్వస్థితికి రావడం వల్ల అధిక రక్తస్రావం తగ్గుతుంది. హార్మోన్ల ప్రభావంవల్ల ఆరు నెలల వరకూ అండం విడుదల కానందువల్ల గర్భధారణ జరగదు. పిల్లలకు పాలు ఇచ్చే తల్లులు సౌందర్యవంతంగా కనిపించడంతో మానసిక రుగ్మతలు దరిచేరవు.

### పాటించాల్సిన ఆహార నియమాలు

తల్లులు పాలిచ్చే సమయంలో కెఫిన్ పుష్కలంగా ఉండే కాఫీలు, శీతలపానీయాలు తీసుకోవడం మంచిది కాదు. మషాళాలు చాలా తక్కువగా తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు తీసుకోవాలి. ద్రవాహారాన్ని పుష్కలంగా తీసుకోవాలి. బీన్స్, వేరుశెనగ, అలసందలు, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఐరన్ ఉక్కువగా ఉండే ఆహారాన్ని విటమిన్-సీతో ఇచ్చే పండ్లతో కలిపి తీసుకోవడం మంచిది. గుడ్లు, పాలు, పాలుత్పత్తులు, బఠానీలు వంటివి తీసుకోవాలి.

### వారోత్సవాలతో అవగాహన: సీడీపీవో ఉషా

జిల్లాలో పెద్దాపురం, కాకినాడ రెవెన్యూ డివిజన్ల పరిధిలో 10 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లు ఉండగా సామర్లకోట అర్బన్ ప్రాజెక్ట్ పరిధి సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లోను, సామర్లకోట రూరల్ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యవంతం చేసే కార్యక్రమాలను ఈనెల 7 వరకూ నిర్వహించేలా సిబ్బందిని ఆదేశించామని సీడీపీవో ఉషా తెలిపారు.

## 15మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

కాకినాడ క్రైం, ఆగస్టు 4: కాకినాడ జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 15మంది ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలేశ్వరం పీఎస్‌లో పనిచేస్తున్న జి.సతీష్ కిర్లంపూడి పీఎస్‌కు స్థానచలనం పొందారు. తుని టౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.రామలింగేశ్వర్‌రావు ఏలేశ్వరం పీఎస్‌కు బదిలీ అయ్యారు. సామర్లకోట పీఎస్‌లో పనిచేస్తున్న వి.మౌనిక పెద్దాపురానికి బదిలీ అయ్యారు. కాకినాడలో వేకెన్సీ రిజర్వ్‌డ్(వీఆర్)లో ఉన్న పి.సత్యనారాయణ కొరంగి ఎస్‌ఐగా స్థానచలనం పొందారు. గొల్లపాలెం ఎస్‌ఐగా పనిచేస్తున్న టి.తులసిరామ్, గండేపల్లి ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ, పిఠాపురం టౌన్ ఎస్‌ఐ ఆర్.మురళీమోహన్, అన్నవరం ఎస్‌ఐ వి.కిషోర్, పెదపూడి ఎస్‌ఐ పి.శోభన్‌బాబు, తొండంగి ఎస్‌ఐ బి.వినయ్‌ప్రతాప్‌లను కాకినాడ వీఆర్‌లో ఉంచారు. కిర్లంపూడి ఎస్‌ఐ ఎస్‌కే జబీర్, కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ, జగ్గంపేట ఎస్‌ఐ కె.నాగార్జునరాజు, తుని రూరల్ ఎస్‌ఐ డి.రమేష్‌బాబు, కోటనందూరు ఎస్‌ఐ బి.శంకర్‌రావును ఏలూరు రేంజ్‌లో వీఆర్‌కు పంపుతూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అరగుండు చేయించుకుని మొక్కు తీర్చుకున్న టీడీపీ నేత - మెయిన్‌లో

లేట'రైట్.. రైట్'పై అధికారుల పరిశీలన - మెయిన్‌లో



## కాలం నీ నేస్తం ముస్తఫా...

మోతుగూడెం మన్యంలో కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పాలనురగలా జాలువారుతూ ఆకట్టుకుంటున్నాయి. పొల్లూరు జలపాతం అందాలు మురిపిస్తున్నాయి, ఈ ప్రాంతానికి కింద పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకుంటున్నాయి. భారీ వర్షాలకు కొండవాగు ప్రాంతాలు జలపాతాలను తలపిస్తూ ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఫ్రెండ్‌షిప్‌డే కావడంతో పర్యాటకులు పొల్లూరు జలపాతం వద్ద సందడి చేశారు. ముస్తఫా... ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా... కాలం నీ నేస్తం ముస్తఫా అంటూ పాట పాడుకుంటూ ఆనందంగా గడిపారు.

- మోతుగూడెం



## ఉదయిస్తు భానుడూ...

శ్రీసూర్యనారాయణ మేలుకో... హరి సూర్యనారాయణ అన్నట్టుగా ఉంది కదూ... తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు వద్ద గోదావరిలో ఆదివారం కనిపించిన సూర్యోదయం చిత్రమిది. - పెరవలి

# నేటి నుంచి సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

### అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటం సమర్పించనున్న దాత మట్టే సత్యప్రసాద్

అన్నవరం, ఆగస్టు 4: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర ఆవిర్భావ వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన జరుపుతారు. మంగళవారం స్వామివారి ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరించనున్నారు. అనివేటి మండపంలో ఆయుష్య హోమం చేస్తామని అధికారులు వెల్లడించారు.

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మి అమ్మవారికి లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ తయారు చేయించిన వజ్రకిరీటం, స్వామి, అమ్మవార్ల వజ్రకర్ణాభరణాలను దేవస్థానం అధికారులకు సోమవారం మధ్యాహ్నం అందజేయనున్నారు. ఈ మేరకు దాత ఆదివారం దేవస్థానం అధికారులు, పండితులతో చర్చించారు. మంగళవారం ఉదయం మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాల అనంతరం వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్ పాల్గొన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు



రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆదివారం రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, దెందులూరు ఎమ్మెల్యే ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దర్శించారు. దేవస్థానంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు వీరంతా హాజరయ్యారు. వారికి పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్వో గణపతిరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

## ఆనాటి ఆ స్నేహ ఆనంద గీతం...



వీరంతా శ్రీకాకుళంలోని గురజాడ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1993-94 బ్యాచ్ బీఈడీ విద్యార్థులు. ఇందులో రవికుమార్, దేవానంద్, చంద్రరావు, రాంబాబు, రాజారావు తూర్పు గోదావరి జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారి సహాధ్యాయి డి.నరసింహ కిశోర్ ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ. ఆదివారం వారంతా రాజమహేంద్రవరంలో కలుసుకున్నారు. ఎస్పీకి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. ఆలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కొద్దిసేపు ఆనందంగా గడిపారు.

... రాజమహేంద్రవరం సిటీ

# చంద్రబాబు పాలనతో పరిశ్రమలకు భరోసా

- 'అల్ట్రాటెక్' ప్రమాద మృతులకు భారీ పరిహారం చెల్లించాం
- ఈఎస్ఐ పరిధిలోకి అసంఘటిత కార్మికులు, జర్నలిస్టులు
- తప్పుడు పనులు చేసేవారిని సమర్థించేది లేదు
- మీట్ ది ప్రెస్‌లో మంత్రి కార్మిక శాఖ మంత్రి సుభాష్



రామచంద్రపురం (ద్రాక్షారామ), ఆగస్టు 4: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతో రాష్ట్రంలో పరిశ్రమలకు భరోసా వచ్చిందని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని బుచ్చిరాజు కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. ఇటీవల అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించామన్నారు. గత వైసీపీ పాలనలో పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవడంలో థర్డ్ పార్టీని ప్రవేశపెట్టి పరిశ్రమలను దోచుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవేత్తలకు భరోసా లభించిందన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులను, జర్నలిస్టులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. ఈఎస్ఐ సౌకర్యంతో మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై భారం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈఎస్ఐ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగపరచలేదన్నారు. 34 మంది వైసీపీ కార్యకర్తలను చంపినట్టు సాక్షి చానల్‌లో తప్పుడు ఆరోపణలు చేశారని, వారి పేర్లు చెప్పమంటే మాజీ సీఎం జగన్‌కు మాటలు రావడం లేదన్నారు. ప్రభుత్వంపై తన పత్రిక, చానల్ ద్వారా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటీవల పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో బెదిరింపు కేసులో ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారని, వారిని అరెస్టు చేసేందుకు గాలిస్తున్నారన్నారు. తాను వారిని సమర్థిస్తున్నట్టు తప్పుడు వార్తలు ప్రచారం చేశారని, తాను మద్దతు ఇస్తే వారిపై పోలీసు కేసు నమోదు ఎందుకు అవుతుందన్నారు. తప్పుడు పనులుచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించనని స్పష్టం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గంలో ప్రెస్‌క్లబ్ భవనం నిర్మాణానికి సహకరిస్తానన్నారు. నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు ఉద్యోగాలు, వైద్య పరీక్షలు, కృత్రిమ అవయవాలు సమకూర్చేందుకు మెగా శిబిరం ఏర్పాటు చేయిస్తానన్నారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నియంత్రణ పాటించాలని, లేనిపక్షంలో తానే కనీస చార్జీలతో ల్యాబ్, మెడికల్ షాపు పెడతానని హెచ్చరించారు. డీఎస్సీ పరీక్ష రాసేవారికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ఉద్దేశించిన పోస్టర్‌ను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. తన పూర్తి సహకారంతో ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందేందుకు వీఎస్ఎం కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తామని చెప్పారు.

# హౌసింగ్ మాయాజాలం!

- టీడీపీ హయాంలో ఇల్లు మంజూరు
- వైసీపీ హయాంలో నిర్మాణం
- బిల్లు మంజూరు కాక అప్పులు చేసి పూర్తి
- రూ.77వేలు చెల్లించినట్టు రికార్డుల్లో...
- ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాని వైనం
- ఆవేదన చెందుతున్న వృద్ధ దంపతులు



కొప్పవరంలో వృద్ధ దంపతులు నిర్మించుకున్న ఇల్లు




తాతారెడ్డి, మంగయ్యమ్మ దంపతులు

అనపర్తి, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలంలో హౌసింగ్ మాయాజాలం వెలుగు చూసింది. గృహ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు సుమారు రూ.77వేలు చెల్లించినట్టు అధికారులు రికార్డుల్లో చూపిస్తున్నారు. అయితే తమ ఖాతాలోకి ఒక్క రూపాయి కూడా జమకాలేదంటున్నారు లబ్ధిదారులు. వివరాలు ఇలా వున్నాయి... తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన సత్తి తాతారెడ్డి-మంగయ్యమ్మ దంపతుల పాత ఇల్లు శిథిలావస్థకు చేరుకోడంతో 2018లో అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఆశ్రయించగా హౌసింగ్ లోన్ మంజూరు చేయించారు. దాంతో వారు తమ వద్ద ఉన్న కొద్దిపాటి సొమ్ముతో గృహ నిర్మాణం ప్రారంభించారు. 2019లో ప్రభుత్వం మారడంతో ఒక్క బిల్లు మంజూరు కాలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అయినా నేటికీ ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డిని ఆశ్రయించడంతో ఆయన వారిని వెంట పెట్టుకుని హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఆరా తీశారు. వీరికి 2020 జూన్ 23న రూ.1, 2020 జూలై 24న రూ19,299, 2023 జూన్ 20న రూ.19,500 2023 జూలై 6న రూ.38,800 జమ చేసినట్టు రిపోర్టు ఇచ్చారు. దీంతో మాజీ సర్పంచ్ వారిని వెంట బెట్టుకుని మహేంద్రవాడలోని స్టేట్ బ్యాంకుకు వెళ్లగా వారి ఖాతాలో హౌసింగ్ నుంచి ఒక్క రూపాయి కూడా జమకాలేదని స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఖంగుతిన్నారు. తిరిగి హౌసింగ్ కార్యాలయానికి చేరుకుని ఏఈ వనమయ్య, డీఈ వేణుగోపాల్‌లకు పరిస్థితిని వివరించగా మంగయ్యమ్మకు చెందిన రెండో ఖాతాలో సొమ్ము జమ అయినట్టు రిపోర్టు ఇచ్చారు. తిరిగి అదే బ్యాంకుకు వెళ్లినా ఆ ఖాతాలో కూడా ఒక్క రూపాయీ పడలేదని తేలింది. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశామని, కుమారుడిని కూడా పోగొట్టుకున్నామంటూ వృద్ధ దంపతులు కన్నీరుపెట్టుకున్నారు. దీంతో మాజీ సర్పంచ్ వెంకటరామారెడ్డి అధికారులను నిలదీయగా... సాంకేతికలోపంతో ఇలా జరిగి ఉండవచ్చని, ఇప్పటివరకు విషయం తమ దృష్టికి రాలేదని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని డీఈ వేణుగోపాల్ తెలిపారు. లోపాన్ని సరిచేసి రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మాట్లాడుతూ బాధితులకు రుణం మొత్తం రూ.1.50 లక్షలు ఒకేసారి అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో మంజూరైన అనేక మందికి బిల్లులు రాలేదని, అధికారుల చుట్టూ తిరగలేక వారంతా ఊరుకున్నారని, విచారణ జరిపిస్తే ఇలాంటి అనేక సంఘటనలు బయటపడతాయన్నారు.

# వైద్య రంగంలో 'మైక్రో బయాలజీ'దే కీలక భూమిక

- అంతర్జాతీయ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి
- జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ముగిసిన ఐఎఐ సదస్సు



రాజానగరం, ఆగస్టు 4: రానున్న ఐదేళ్లలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు మైక్రోబయాలజీ మూలాధారం అవుతుందని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ 'పద్మభూషణ్' డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండు రోజులు జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా 100 సెంటర్లలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. దేశంలోని ఆరు కేంద్రాల్లో పరిశోధనలు జరుగుతుండగా..... ప్రైవేట్ రంగంలో ఏకైక సంస్థ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ-ఏఐజీ ఛైర్మన్‌గా తాను వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. సహజ స్వాభావిక ఆహారం, అవసరమైన బ్యాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు భవిష్యత్తులో చికిత్స అవుతుందని వివరించారు. పేగుల్లో నివసించే వెయ్యి రకాల బ్యాక్టీరియాలో హెచ్చు తగ్గులు రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా ఆహారంలో మార్పుల వల్లే బ్యాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరాల జబ్బులు, వ్యాధులు సంక్రమిస్తున్నాయని నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. సిజేరియన్ కాకుండా సహజ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు, కనీసం ఆరు నెలలు తల్లి పాలు తాగిన బిడ్డలు, ఆరు నెలలలోపు యాంటీబయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బ్యాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడం లేదని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటి భోజనం చేసే వారికి, బయట జంక్ ఫుడ్ తీసుకునే వారికి బ్యాక్టీరియాల్లో తేడాలను ప్రయోగాల్లో తమ సంస్థ గమనించిందన్నారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ, దోసె, పెరుగు మొదలైనవి తిన్నవారిలో కేన్సర్ నెమ్మదించినట్టు అధ్యయనాల్లో తేలిందన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతిసారీ జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు కొత్త అనుభవాలను ఇనుమడింపచేస్తున్నారని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు. డాక్టర్ వాడ్రేవు రవి (కాకినాడ), డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) చైర్‌పర్సన్లుగా వ్యవహ రించగా డాక్టర్ వాణీమాధవి (జీఎస్ఎల్), డాక్టర్ వీఎస్ఎస్ శర్మ (అమలాపురం), డాక్టర్ సోమనాథ్‌దాస్ (జీఎస్ఎల్) ముగింపు సదస్సు నిర్వహించారు. చివరగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల యాజమాన్యం దుశ్శాలువాతో సత్కరించింది.



# కాపర్ వైరు దొంగలు దొరికారు

- తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన పదకొండు మంది అరెస్టు
- మినీ వ్యాన్, ఆటో, రూ.2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు



కొవ్వూరు, ఆగస్టు 4: పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగలుగొట్టి కాపర్ వైరు దొంగతనం చేస్తున్న 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక మినీ వ్యాన్, ఆటో, రూ.2.40 లక్షలు విలువైన 420 కిలోల కాపర్ వైరు, దొంగతనాలకు వినియోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను కొవ్వూరు రూరల్ సీఐ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 4, కొవ్వూరు టౌన్‌లో 2, తాళ్లపూడిలో 1, నల్లజర్లలో 3, చాగల్లులో 1, దేవరపల్లిలో 2, గోపాలపురంలో 1, రాజానగరంలో 2, కాకినాడ జిల్లా అన్నవరంలో 2 కేసులకు సంబంధించి 22 ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి దొంతనాలకు పాల్పడిన ఏడుగురిని, కాపర్ వైర్ కొనుగోలు చేసిన నలుగురు వ్యాపారస్తులను అరెస్టు చేశారు. కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన సారిక సురేష్ తాపీ పనిచేస్తూ అప్పుడప్పుడు హైదరాబాద్ వెళ్లి వస్తుండేవాడు. హైదరాబాద్‌లో కాకినాడ జిల్లాకు చెందిన పల్లా లోవరాజు, వేములూరుకు చెందిన తంపర సురేష్, సారిక దుర్గారావు, మట్టా శివ, మల్లిచెట్టు దోలానంద్, మంగిన అజిత్‌కుమార్, రేఖ సుధాకర్ ఒకేచోట తాపీ పని పనిచేస్తుండేవారు. సారిక సురేష్ ఎలక్ట్రీషియన్ పని నేర్చుకున్నాడు. ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వాటిలో రాగి వైరు అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు సంపాదించుకోవచ్చని ఎనిమిది మంది నిర్ణయించుకున్నారు. పలు పోలీసుస్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల పగలగొట్టి వాటిలోని కాపర్ వైరు వేరు చేసి పల్లా లోవరాజు వ్యానులో తీసుకొచ్చేవారు. అనంతరం వాటిని కొవ్వూరు మండలం సీతంపేటలో జై హనుమంతు టింకరింగ్ షాప్‌లో నరమామిడి సత్యనారాయణ, కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శ్రీ వెంకట దుర్గా ఆంజనేయ ట్రేడర్స్‌లో సరిక కృష్ణ, పెరవలి మండలం కాపవరంలో చింతలపూడి సత్యనారాయణ, రాజమహేంద్రవరం లాలాచెరువు హౌసింగ్ బోర్డులో బీఆర్ఎస్ ఎంటర్‌ప్రైజెస్‌లో పన్నెరు నంది కేశవరావులకు చెందిన పాత ఇనుప సామగ్రి కొనే షాపుల్లో విక్రయించేవారు. ఇటీవల కొవ్వూరు మండలం చిడిపిలో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనానికి వెళ్తుండగా కొవ్వూరు రూరల్ పోలీసులు, క్రైం పోలీసులు దాడి చేసి ఏడుగురిని, ఆపై వైరు కొనుగోలు చేసిన నలుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. దర్యాప్తులో విశేష కృషి చేసిన కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్, క్రైం ఎస్ఐ కె.జగన్మోహనరావు, ఏఎస్ఐ జె.ధర్మరాజు, టి.శ్రీనివాసరావు, జి.అనీల్‌కుమార్, అఫ్సారీబేగ్, ఎస్.గణేష్, ఎస్కే వల్లీబాబు, హెచ్‌సీ జీఎస్ఆర్‌కే పరమహంసలను సీఐ అభినందించారు.

# రైలులో గర్భిణి ప్రసవం

- అప్రమత్తమైన జీఆర్పీ పోలీసులు
- ఆసుపత్రికి తరలింపు... తల్లీబిడ్డ క్షేమం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న ఒక నిండు గర్భిణి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన అమరజీత్ రామ్. అతని భార్య హీరాకుమారి జీవనోపాధి నిమిత్తం కోయంబత్తూరులో ఉంటున్నారు. నెలలు నిండిన హీరాను బిహార్ తీసుకెళ్లడానికి ఈ నెల 3న బొకారో ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. రైలు రాజమహేంద్రవరం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి హీరాకు పురిటినొప్పులు రాగా వెంటనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ సమాచారం తెలిసిన సీఐ విజయశంకర్ స్పందించి రైలు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వచ్చేసరికి రైల్వే వైద్యులను, జీఆర్పీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్టేషన్‌కు రైలు రాగానే తల్లీబిడ్డను కిందకు దింపించి స్టేషన్లో హెల్త్ చెకప్ చేయించి ఆపై 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని విజయశంకర్ వివరించారు.



హీరాకు వైద్యం అందిస్తున్న వైద్యులు

# గంజాయి గుట్టురట్టు

### దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీ... వ్యాను ప్రత్యేక అరలో 444 కిలోల పట్టివేత

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 4: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద గంజాయి తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని 443.860 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సౌత్‌జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన సమాచారంతో శనివారం సాయంత్రం దివాన్‌చెరువు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 14 ప్లాస్టిక్ సంచుల్లో గంజాయి ఉందన్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి తమిళనాడు 8వ క్రాస్‌స్ట్రీట్ హౌసింగ్ బోర్డు, కురుంబాపేటకు చెందిన డ్రైవర్ దివాకర్‌ను అరెస్టు చేశామన్నారు. అతన్ని విచారించగా.. ఈనెల 3న దివాన్‌చెరువు వద్దకు వచ్చిన డ్రైవర్ దివాకర్, వ్యాన్ యజమాని కలిసి గండేపల్లి మండలం మురారి గ్రామం వెళ్లారని, అక్కడ మరో వ్యక్తితో కలిసి వ్యానులో జగ్గంపేట వెళ్లి జాతీయ రహదారిలో ఏజెన్సీ రోడ్డులోకి సుమారు 9 కిలోమీటర్లు వెళ్లాక దివాకర్‌ను అక్కడే ఉంచి మిగిలిన ఇద్దరూ అడవిలోకి వెళ్లారు. కొన్ని గంటల తర్వాత ఇద్దరూ వ్యాన్‌లో తిరిగొచ్చారు. జగ్గంపేట వచ్చాక ఆ ఇద్దరు దిగిపోయి వ్యాన్‌ను జాగ్రత్తగా తమిళనాడులో దిండివనం ప్రాంతానికి చేర్చమని దివాకర్‌కు చెప్పారు. జాతీయ రహదారిపై వ్యాను వస్తుండగా దివాన్‌చెరువు వద్ద పట్టుకున్నామని, తనిఖీ చేయగా వ్యాన్ క్యాబిన్ వెనుక ఏర్పాటు చేసిన ప్రత్యేక అరలో గంజాయిని గుర్తించామని తెలిపారు. డ్రైవర్ దివాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిశోర్ ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి విక్రయం, వినియోగాన్ని నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్‌లు, కార్డన్ సెర్చ్, వాహనాల తనిఖీ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్

# కాకినాడ



## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 4: సోమవారం ఉదయం 10.30గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ భావన తెలిపారు. శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తామని,08842357800కు సమస్యలు తెలియజేయవచ్చని చెప్పారు.

## 'విలీన గ్రామ పంచాయతీల భవితవ్యంపై తేల్చాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 4: గత 13 ఏళ్లుగా రమణయ్యపేట గ్రామ పంచాయతీతో పాటూ మిగతా 5 పంచాయతీలకు ఎన్నికలు జరక్కపోవడంతో ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాక గ్రామాభివృద్ధి కుంటుపడిందని తక్షణమే విలీన పంచాయతీల భవితవ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆదివారం రమణయ్యపేట మాజీసర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణ మూర్తి దంపతులను కలుసుకుని వినతి పత్రం అందించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలుగా ఎన్నికలు జరిపించాలని, లేదంటే నగరపాలక సంస్థలో విలీనం చేసి ఎన్నికలు జరిపించేలా కృషి చేయాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలవాలని సూచించడం జరిగిందన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సానుకూల నిర్ణయం తీసుకునేలా సహకరిస్తామని మాజీ ఎమ్మెల్యే దంపతులు తెలిపారు.

## 'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

గొల్లప్రోలు, ఆగస్టు 4: పర్యావరణ పరిరక్షణను అందరు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని బీజేపీ నాయకులు కోరారు. అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలు పట్టణంలోని కైలాస భూమి వద్ద వారు ఆదివారం మొక్కలు నాటారు. ఖాళీస్థలాల్లో, ఇంటి వద్ద మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార మీడియా ప్రతినిధి పెదిరెడ్డి రవికిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, తోట ఏడుకొండలు, పసుపులేటి సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాసరావు, కర్రి సత్యనారాయణ, మలిరెడ్డి నారాయణరావు, ఉలవశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 'మార్పులు, చేర్పులు పార్లమెంట్ ద్వారానే జరగాలి'

పిఠాపురం, ఆగస్టు 4: ఎస్సీ కులాల్లో మార్పులు, చేర్పులు పార్లమెంట్ ద్వారానే జరగాలని పీవీ రావు మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు వేశంగి వెంకటేష్, నాయకులు కొంగు నూకరాజు, దడాల నూకరాజు, ఇజ్జన చలపతిరావు, బత్తుల రాంజీకుమార్, మాతా బాలకృష్ణ, శీకోలు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికను క్షేమంగా అప్పగించిన రైల్వే పోలీసులు

సామర్లకోట, ఆగస్టు 4: సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 13 ఏళ్ల గల బాలికను రైల్వే పోలీసులు చేరదీసి ఆమె నుంచి సేకరించిన సమాచారంతో విశాఖలోని కంచరపాలెం పోలీసులకు ఆదివార క్షేమంగా అప్పగించారు. తాడి ఆశాజ్యోతి అనే బాలిక విశాఖలోని కంచరపాలెంలో బాల భాను పాఠశాలలో 8వ తరగతి చదువుతూ అమ్మమ్మ సంరక్షణలో ఉంటుంది. అనుకోని కారణాలతో విశాఖలోని శనివారం సాయంత్రం రైలు ఎక్కి సామర్లకోటలో దిగి ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించి బాలిక చెప్పిన సమాచారం మేరకు విశాఖలోని అమ్మమ్మకు సమాచారం అందివ్వగా అప్పటికే బాలిక కనిపించడంలేదని కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో కంచరపాలెం పోలీసులకు సామర్లకోట పోలీసులు సమాచారం అందివ్వడంతో కంచరపాలెం పోలీసులు బాలిక అమ్మమ్మను వెంటబెట్టుకుని ఆదివారం సామర్లకోట చేరుకున్నారు. సామర్లకోట రైల్వే పోలీసులకు బాలికను కంచరపాలెం పోలీసులకు అప్పగించారు.

## చిట్‌ఫండ్స్ సంస్థ అధినేత అరెస్ట్

కాకినాడ క్రైం, ఆగస్టు 4: డబ్బు మొత్తం కట్టిన తర్వాత మెచ్యూరిటీ అయిన సొమ్మును తిరిగి చెల్లించకుండా మోసగించిన ఓ చిట్‌ఫండ్స్ సంస్థ అధినేతను కాకినాడ టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కాకినాడ భానుగుడి కోకిలా సెంటర్ సమీపంలో సేతు మాధవరావు శ్రీ వినాయక చిట్స్ అండ్ ఫైనాన్స్ అనే సంస్థను నడుపుతున్నాడు. కాగా ఆ సంస్థలో చాలామంది డబ్బు కట్టగా కొంతమంది సొమ్ము మెచ్యూరిటీ చెందింది. ఆ ఖాతాదారులు సంస్థ చుట్టూ తిరిగినా మాధవరావు ముఖం చాటేయడంతో 26మంది బాధితులు రూ.1.08 కోట్లు సంస్థ యజమాని తమకు ఇవ్వాలని జిల్లా అసిస్టెంట్ రిజిస్టర్ ఆఫ్ చిట్స్‌కు ఫిర్యాదు చేశారు. ఆ అధికారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి మాధవరావును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సర్పవరం జంక్షన్, ఆగస్టు 4: వారంతా నాలుగు దశాబ్దాల తర్వాత ఒకచోట కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని, పదో తరగతి స్కూలు విశేషాలు నెమరవేసుకుని, సాధించిన విజయాలు, కుటుంబ సభ్యుల బాగోగులను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ పాఠశాల 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీకన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ బ్యాచ్‌లో ఆర్థికంగా వెనుకబడిన పూర్వ విద్యార్థుల కుటుంబాల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముందుగా అల్పాహారం, సామూహికంగా మధ్యాహ్నం భోజనం నిర్వహించారు.

### తునిలో...

తునిరూరల్, ఆగస్టు 4: తుని రాజా హైస్కూల్లో 2004 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. తమ ఉపాధ్యాయులను సన్మానించారు. రూ.40వేలతో ఆర్వో ప్లాంట్‌ను స్కూల్లో ఏర్పాటు చేయగా హెచ్ఎం శేషగిరిరావు చేతులమీదుగా ప్రారంభించారు. పాఠశాల ఉన్నతికి సాయం అందజేస్తామన్నారు.

## 8న దివ్యాంగుల ఉపకరణాల కోసం శిబిరం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 4: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 8న రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాల మంజూరు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు 3 చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలకు ఎంఎస్ ఈఈ కిట్లు, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్లు, సీపీ చైర్ బ్యాటరీ ఆపరేటెడ్ 3 చక్రాల సైకిల్ కోసం గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు సదరం ధ్రువీకరణపత్రం, రేషన్, ఆధార్ కార్డు, యూడీఐడీకార్డు తీసుకురావాలని కోరారు.

### 9న పెద్దాపురంలో...

సామర్లకోట, ఆగస్టు 4: సామర్లకోట మండల, పట్టణ పరిధిలో దివ్యాంగులకు ఉపకరణాల మంజూరుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 9న పెద్దాపురం అంబేడ్కర్ భవన్ ఆవరణలో ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్టు సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3చక్రాల సైకిళ్ళు, వీల్‌చైర్స్, చంకకర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్ చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలకు ఎంఎస్‌ఈఈ కిట్స్, లెప్రసీ సోకినవారికి ఏడీఎల్ కిట్స్, సీపీ చైర్ బ్యాటరీ ఆపరేటెడ్ 3చక్రాల సైకిళ్లు మంజూరు చేయనున్నందున వివిధ ధ్రువీకరణ పత్రాలతో శిబిరానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## గొల్లప్రోలులో ఉచిత వైద్య శిబిరం

గొల్లప్రోలు, ఆగస్టు 4: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో టీఆర్‌సీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కాకినాడ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో ఈ శిబిరం నిర్వహించినట్టు ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల రవిచంద్రన్ తెలిపారు.

## విశ్వబ్రాహ్మణసంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

కిర్లంపూడి, ఆగస్టు 4: కిర్లంపూడి విశ్వబ్రాహ్మణసంఘ అధ్యక్షుడిగా గానుగుల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కిర్లంపూడిలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణసంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘాధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం అధ్యక్షతన జరిగింది. మండలాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, జిల్లా విశ్వబ్రాహ్మణసంఘ ఉపాధ్యక్షుడిగా కొత్త శ్రీనివాసరావు, కార్యదర్శిగా కాకిలేటి నాగబ్రహ్మాచారి, కొండేపూడి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అలమండ విజయసారధి,కొత్తల వీరప్రసాద్, ఆవుపాటి మహాశంకర్, కె.సత్యనారాయణ,తాతాచారి ఉన్నారు.

## పశుగ్రాసం అందజేత

సామర్లకోట, ఆగస్టు 4: మండలంలో హుస్సేన్‌పురానికి చెందిన యువత కాకి నాడలోని జంతుహింసా నివారణ సంఘం(ఎస్‌పీసీఏ)లోని ఉన్న పశువులకు 4 టన్నుల పచ్చటి పశుగ్రాసాన్ని కొడవళ్ళతో కోసి ప్రత్యేక వాహనంపై ఆదివారం తరలించి మూగజీవాలకు అందించారు. గ్రామ టీడీపీ నాయకులు చల్లా బుజ్జి సౌజన్యంతో పచ్చగడ్డిని తరలించేందుకు బొలెరో వాహనాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో టేకుమూడి రాజు, పుప్పాల నాయుడు, మార్ని వీర్రాజు, టేకుమూడి బూరయ్య, అయినాల కృష్ణ, మార్ని దుర్గారావు, పుప్పాల శ్రీనులు స్థానిక నవభారత్ క్షేత్రంలో ఏపుగా ఎదిగిన పచ్చగడ్డిని కోసి మోపులు కట్టి బొలెరో వాహనంలో కాకినాడకు తరలించారు.

## ఉపాధ్యాయుడికి సన్మానం

శంఖవరం, ఆగస్టు 4: ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు కర్నీడి సత్యనారాయణను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కత్తిపూడిలో నిర్వహించిన సన్మాన సభలో వక్తలు మాట్లాడుతూ సత్యనారాయణ ఎంతోమంది విద్యార్థులను ఉన్నతి స్థితికి చేర్చారన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లు సిద్ధం!



బోట్‌క్లబ్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్,ఏలేశ్వరంలో సిద్ధమైన క్యాంటీన్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 4: నిరుపేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. జీవనోపాధి, కూలి పనుల కోసం సిటీకి వచ్చే వారికి 3 పూటలా కడుపు నిండా రూ.5లకే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి ఆహారం అందించే అన్న క్యాంటీన్లను చంద్రబాబు 2018లో ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2019 నుంచి వీటిని మూసేసి పేదల కడుపు కొట్టింది. ఈ భవనాల్లో కొన్నింటిని కూల్చివేసింది. మరికొన్నింటిని సచివాలయాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కొన్నింటికి ఖాళీగా ఉంచేసి శిథిలావస్థకు చేరేలా చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఆగస్టు 15 నుంచి ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రమణయ్యపేట మార్కెట్ బోట్‌క్లబ్‌లో శిథిలావస్థకు చేరిన అన్న క్యాంటీన్ భవనానికి కార్పొరేషన్ నిధులతో మరమ్మతులు నిర్వహించి ఆధునీకరణ పనులు చేస్తున్నారు. క్యాంటీన్ ఆధునీకరణ పనులను కార్పొరేషన్ డీఈ వెంకటరావు, ఏఈ రమేష్‌బాబులు పర్యవేక్షిస్తున్నారు. భవన ఆధునీకరణ, విద్యుద్దీకరణ, ప్లంబింగ్ పనులు పూర్తికావచ్చాయని డీఈ వెంకటరావు తెలిపారు.

### ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం, ఆగస్టు 4: గత ప్రభుత్వంలో పేదలకు పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల వ్యవధిలోనే అన్న క్యాంటీన్లు మళ్లీ వచ్చేస్తున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలో మార్కెట్‌లో భవనం రూపుదిద్దుకోంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆగస్టు 15న అట్టహాసంగా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తుండడంతో అధికారులు సిద్ధం చేస్తున్నారు.


కిర్లంపూడిలో నీట మునిగిన వరినాట్లు

## నీట మునిగిన వరి చేలు

కొత్తపల్లి, ఆగస్టు 4: కొత్తపల్లి మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వరి చేలు నీట మునిగాయి. గత 3 వారాలుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్‌లో వరిసాగు పనులను రైతులు జోరుగా సాగు చేపట్టారు. వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు వస్తుండటంతో పంట కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో వరద నీరు వరి పంట భూముల్లోకి రావడంతో వెదజల్లు, వరినాట్లు నీటముంపుకు గురవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండలంలో పలు వ్యవసాయ భూములు నీటమునిగాయి. వాకతిప్పలో సుమారు 100 ఎకరాల వరి పంట మునిగి పంట నష్టపోయినట్లు రైతులు తెలిపారు. పంట పొలాలను కాపాడేందుకు వీలుగా నీరు బయటకు వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**కిర్లంపూడి:** అధిక వర్షాలకు కిర్లంపూడి, రాజుపాలెం, చిల్లంగి, జగపతినగరం పలు గ్రామాల్లో రైతులు నాట్లు వేసిన వరిచేలు వర్షపునీటితో నిండిపోయాయి.

## శాకంబరిగా పుర్హుతికా అమ్మవారు


పుర్హుతికా అమ్మవారికి శాకంబరి అలంకారం

పిఠాపురం, ఆగస్టు 4: పట్టణంలోని పాదగయ క్షేత్రం లో ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవతైన పుర్హుతికా అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. ఆషాఢఢ మాసం అమావాస్య సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, పండ్లు, పుష్పాలతో అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, సూపరింటెండెంట్ కేవీ రమణ పాల్గొన్నారు.

## శాకంబరి అలంకరణలో అమ్మవార్లు


శాకంబరి అలంకరణలో నూకాలమ్మ

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 4: నగరంలో ప్రసిద్ధి చెందిన రామారావుపేట అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి అమ్మవారు, టూటౌన్ నూకాలమ్మవారు భక్తులకు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం దేవాలయాల్లో అమ్మవార్లను పండ్లు, కూరగాయలతో అలంకరించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండ బాబు అన్నపూర్ణదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో బాదం వాసు, దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు, అధికంగా భక్తులు పాల్గొన్నారు.

## 'ఐఈఈఈ మంచి వేదిక'

జేఎన్టీయూకే, ఆగస్టు 4: వివిధ సాంకేతిక అంశాలు, ఇంటర్వ్యూ స్కిల్స్, నైపుణ్యాభివృద్ధి అంశాలను మెరుగుపరచుకునేందుకు ఐఈఈఈ మంచి వేదిక అని యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అన్నారు. వర్సిటీ ప్రాంగణంలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, యూసీఈకే(బ్రాంచ్‌కోడ్-ఎస్టీబీ 60222795)ని ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగాను, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి గౌరవఅతిథిగా పాల్గొనగా ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బీటీ కృష్ణ, ఏఎం ప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాసకుమార్, పద్మరాజు ఉన్నారు.

## 'సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం'

పిఠాపురం, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణ కోసం మందా కృష్ణమాదిగ 3 దశాబ్దాలకు పైగా చేస్తున్న డిమాండ్, పోరాటం న్యాయమైనదని సుప్రీంకోర్టు తీర్పు ద్వారా వెల్లడైందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలతో పాటు ఉప కులాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వారు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిఠాపురం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి జయరాజు, ఆరుగుల జార్జి, కాకాడ చిట్టిబాబు,కొల్లి రాజు పాల్గొన్నారు.

## 'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 4: సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆర్‌పీఐ(అంబేడ్కర్) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో అగ్ర కుల యువతిని అతడు ప్రేమించగా ఆమె కుటుంబీకులు అతడిని తీవ్రంగా గాయపరిచారన్నారు. అతడిని ప్రభుత్వాస్పత్రిలో చేర్చారని, బాధితుడితో మాట్లాడానన్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

## లోవలో ముగిసిన ఆషాఢ మాసోత్సవాలు

» అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం » ఆలయానికి రూ.8.33లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ, సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 4: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పండితులు సహస్ర ఘటాభిషేకాన్ని సప్త నదీజలాలలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లోవకు తరలివచ్చిన భక్తుల తాకిడి ఎక్కువైంది. అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకున్నారు. భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.8.33లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధ రాజు తెలిపారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించి చక్కదిద్దారు.

### నేటి నుంచి శ్రావణ శోభ

సామర్లకోట, ఆగస్టు 4: సోమవారం నుంచి ప్రారంభంకానున్న శ్రావణమాసోత్సవాలు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, పలు ఆలయాలను సన్నద్ధం చేస్తున్నారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి ఈనెల 10న శ్రావణ మాస మొదటి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, 17న రెండో శనివారం, 24న మూడో శనివారం, 31న నాల్గో శనివారం, ప్రతీ మంగళవారాల్లో ప్ర త్యేక అలంకారాలు చేయనున్నారు. భీమేశ్వరాలయానికి దూరప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు మహాన్నదానం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

## ఉధృతంగానే సుద్దగడ్డ వరద

ఆందోళన చెందుతున్న జగనన్న కాలనీ వాసులు


గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారిపై ప్రవహిస్తున్న సుద్దగడ్డ వరద నీరు

గొల్లప్రోలు, ఆగస్టు 4: సుద్దగడ్డ వరద ఉధృతంగానే ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో సుద్దగడ్డ(కొండ) కాలువల్లోకి వరద నీరు చేరింది. ఆదివారం వరద ఉధృతి మరింత పెరిగి గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీ రహదారిపై 4అడుగుల ఎత్తులో, గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రోడ్డుపై 3అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తున్నది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగనన్న కాలనీ వాసులు వరద నీటిలో నుంచే పట్టణంలోకి వస్తున్నారు. సుద్దగడ్డ వరద నీరు మరింత పెరిగితే గొల్లప్రోలులోని ఇతర కాలనీల్లోకి వరద నీరు చేరే ప్రమాదముందని ఆయా కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పట్టణ శివారులోని సూరంపేట చుట్టూ వరద నీరు చేరింది. దీంతో వరద నీటిని దాటుకునే సూరంపేట వాసులు పట్టణంలోకి వెళ్లాల్సి వస్తున్నది.

### పిఠాపురం రోడ్లపై ఏలేరు నీరు

పిఠాపురం, ఆగస్టు 4: పట్టణంలోని రహదారులపై ఏలేరు నీరు ప్రవహించింది. ఏలేరు రిజర్వాయర్ నుంచి పంటపొలాల కోసం విడుదల చేస్తున్న సాగునీటితో పాటు ఎగువ ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షపునీటితో ఏలేరు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పట్టణం మీదుగా వెళ్లే ఏలేరు కాలువ(చెరుకుల కాలువ) లోని నీరు పట్టణంలోని మంగాయామ్మరావుపేట, చిట్టోడితోట, జీవన్‌నగర్, సీతయ్యగారితోట తదితర ప్రాంతాల్లోని రహదారులపైకి చేరింది. దీంతో ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగించారు. శని, ఆదివారాల్లో ఈ పరిస్థితి ఉందని, ఏటా కాలువలకు అధిక నీరు విడుదల చేస్తే తమ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని ఈ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## యూటీఎఫ్ రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, ఆగస్టు 4: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా కచేరీపేటలోని టీచర్స్ హోంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి యూటీఎఫ్ నాయకులను అభినందించారు. ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆశయాలైన అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆచరణలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఈవో రమేష్ మాట్లాడుతూ విద్యా సంబంధిత విషయాల్లోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి శివప్రసాద్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం ముగ్గురి ప్రాణాలు నిలబెడుతుంద న్నారు. శిబిరంలో 62మంది రక్తదానం చేయగా అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ నగేష్, టి.రవిచక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జి.ప్రభాకరవర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ సాయిరాం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వీవీ.రమణ, నాయకులు కె.సత్తిరాజు, పీవీ.సత్యనారాయణ, ఎస్.వీరబాబు సీహెచ్.సూరిబాబు పాల్గొన్నారు.

## మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ, భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు

పెద్దాపురం, ఆగస్టు 4: మరిడమ్మ జాతరకు చివరి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారీ పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 15వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు తెలియచేశారు.


మొక్కలు నాటుతున్న సభ్యులు

## 'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

రౌతులపూడి, ఆగస్టు 4: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని హరిత సంకల్ప వానర సంస్థ సభ్యులు కోరారు. రాఘవపట్నం రిజర్వు ఫారెస్టులో ఫారెస్టు అధికారి జి.నాగేశ్వరరావుతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు భీమాశంకర్, శ్రీవిద్య, రాజ్‌కుమార్, సంకల్పం టీమ్ ఆర్గనైజర్ వై.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రత్యంగిర హోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు 4: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో ఆదివారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి విశేష అర్చనలు గావించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 99 జంటలు ప్రత్యంగిర హోమంలో పాల్గొన్నారు.

### 60 వేల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు


ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా తలుపులమ్మలోవ నుంచి తిరుగప్రయాణంలో రత్నగిరి వద్ద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల భక్తులతో సుమారు 60 వేల ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు జరిగాయి. ప్రసాదం కొనుగోలుకు భక్తులు బారులు తీరారు. జాతీయ రహదారిపై రెండు నమూనాలయాలు, తొలిపావంచా వద్ద, కొండపై ఈ విక్రయాలు జరిగినట్టు ప్రసాదం విభాగ అధికారులు తెలిపారు.

## ఘనంగా మదుగులమ్మ సంబరం


సంబరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఆగస్టు 4: మదుగులమ్మ సంబరం ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరంలో ముఖ్య అతిథిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పండితులు సోమేశ్వరశర్మ తదితర పండితులు పూజలు చేశారు. గరగల సంబరాన్ని తిలకించిన రాజప్ప గరగల కళాకారులకు నగదు సత్కారం నిర్వహించారు. మదుగులమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ప్రతిష్ఠించి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పుల మధ్య పురవీధులమీదుగా చేపట్టిన గ్రామోత్సవాన్ని రాజప్ప కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. టీడీపీ నాయకులు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

## కరపలో విశేష పూజలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల

కరప, ఆగస్టు 4: కరపలో అన్నవరం దేవస్థానం మాజీ డైరెక్టర్ చాగంటి సూరిబాబు ఆధ్వర్యంలో గణపతి నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం వేదపండితుడు గంగాధరభట్ల సూర్యనారాయణమూర్తి మంత్రోచ్చరణలతో ఘనంగా శ్వేతార్క (తెల్లజిల్లేడు) పూజలు నిర్వహించారు. చాగంటి సూరిబాబు గణపతి స్వామివారికి 101 ఉపనిషత్తు పారాయం, 104 చతరావృత తర్పణాలు, 101 శ్రీషోక్త పురుషోక్త పారాయణం, రుద్రాభిషేకం జరిపారు. పూజా కార్యక్రమంలో ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, బండారు సత్యానందరావు దంపతులు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సతీమణి పంతం అరుణ, అదాని గ్రూప్ సీఎస్ భార్య రాధాదేవి భక్తులు తదితరులు ఉన్నారు.

## 'ఎస్పీకి ఫిర్యాదు చేస్తా'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 4: వ్యాపారంలో భాగస్వామిగా ఉంటూ తనను మోసం చేయడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా ఉద్దేశపూర్వకంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఇంద్రపాలెనికి చెందిన వైసీపీ నాయకుడి కుమారులపై జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేస్తామని కాకినాడలో ఓ సంస్థ సీఈవో కొప్పిశెట్టి షణ్ముఖ సుదర్శన్ తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు.

## విద్యార్థికి సత్కారం

పెద్దాపురం, ఆగస్టు 4: మండల పరిధిలోని వడ్లమూరు గ్రామానికి చెందిన పోలిమాటి స్మైలీ ప్రభుత్వ బాలిక పాఠశాలలో చదివి అత్యధిక మార్కులతో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వడంతో ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడానికి కృషి చేసిన మాస్టర్ ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు రఫీ, షఫీ, స్మైలీని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యాదర్శి రాజాసూరిబాబురాజు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

## సీఆర్పీల సంఘ అధ్యక్షుడిగా ప్రసాద్

ప్రత్తిపాడు, ఆగస్టు 4: సీఆర్పీల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ప్రత్తిపాడుకు చెందిన ఎలిపే రాంజీ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సీఆర్పీల ఉద్యోగ భద్రత,సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ప్రసాద్ తెలిపారు.